క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



మహిళా సంఘ సభ్యులతో మాట్లాడుతున్న స్పెయిన్ బృందం

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల, నిజవల్లి పంచాయతీల్లో ఆర్డీటీ పర్యవేక్షణలో వాటర్‌షెడ్డు గ్రామాల్లో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను శనివారం స్పెయిన్ బృందం పరిశీలించింది. ఆ రెండు పంచాయతీల్లో రూ.20 కోట్లతో ఆర్డీటీ నీటికుంటలు, చెక్‌డ్యాములు, పాడిపరిశ్రమ, పండ్లమొక్కల పెంపకం తదితర అభివృద్ధి పనులు చేపట్టింది. స్పెయిన్ చెందిన మార్‌వా రీవాజ్, కోఫజ్ హెర్నాండే బృందం సభ్యులు పనులను పరిశీలించి ఆయా గ్రామాల్లో మహిళా సంఘ సభ్యులు, రైతులతో మాట్లాడారు.కార్యక్రమంలో ఆర్డీటీ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ హనుమంతరాయుడు, ఎస్‌టీఓ రామాంజనేయులు సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-కేవైసీ త్వరగా పూర్తి చేయండి



రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ పెన్నయ్య

విడపనకల్లు: పీఎం కిసాన్ వర్తించాలంటే త్వరగా ఈ- కేవైసీ పూర్తి చేయాలని ఆర్‌బీకే సిబ్బందికి మండల వ్యవసాయాధికారి పెన్నయ్య సూచించారు. మండల వ్యాప్తంగా దాదాపు 950 మంది రైతులు ఈ-కేవైసీ చేయలేదన్నారు. ఆర్‌బీకేకు వెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవాలని రైతులకు సూచించారు.ఈ-కేవైసీ పూర్తి కాకపోతే ప్రభుత్వ పథకాల లబ్ధి కోల్పోతారన్నారు. అంతకుముందు ఆయన హావళిగి, కరకముక్కల,పాల్తూరు గ్రామాల్లోని ఆర్‌బీకేలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీఈఓ మెర్సీ, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన పాల్తూరు గ్రామంలో విడపనకల్లు సొసైటీ ఎరువుల గోడౌన్‌లో ఎన్న ఎరువుల స్టాకును పరిశీలించారు. ఎరువులను ఈ-పాస్ ద్వారా అర్హులైన రైతులకు పంపిణీ చేయాలని గోడౌన్ కీపర్ ఈశ్వరప్పకు సూచించారు. ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలని, అధిక రేట్లుకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


బాల్యవివాహాలతో అనర్థాలు



పోస్టర్లు విడుదల చేస్తున్న బాలల సంరక్షణ అధికారిణి

ఉరవకొండ: బాల్యవివాహాలు ఆడపిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని జిల్లా బాలల పరిరక్షణ సమితి, బాలల సంరక్షణ అధికారిణి వెంకటేశ్వరి అన్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ బాలికల ఎస్సీ గురుకుల పాఠశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సునిత అధ్యక్షతన బాల్యవివాహాలు, పోక్సో యాక్టు అంశాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాలల సంరక్షణ అధికారిణి మాట్లాడుతూ అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతే పెళ్లి చేయాలన్నారు. ఆడపిల్లలను బాగా చదివించాలన్నారు. బాల్యవివాహాలు చేస్తే చట్టపరమైన శిక్షలు తప్పవన్నారు. బాలికలపై లైంగిక దాడులకు పాల్పడితే పోక్సో యాక్టు కింద కేసులు నమోదు అవుతాయన్నారు. అనంతరం బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తూ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజమ్మ, పోలీసు అనిత తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా!



బీటీపీ లేఅవుట్ ఇందిరమ్మ కాలనీలో తవ్వకాలు చేపట్టిన దృశ్యం

రాయదుర్గం: పట్టణ పరిధిలోని బీటీపీ రోడ్డులో ఏర్పాటైన ఇందిరమ్మ కాలనీలో కొందరు దర్జాగా అర ఎకరం ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో సర్వే నెంబర్ 36, 37లో విలువైన భూమిని కొనుగోలు చేసి పేదలకు ఉచితంగా పంపిణీ చేసి ఇళ్లు కట్టించారు. ఇందులో ప్రభుత్వ అవసరాల దృష్ట్యా అదనంగా అర ఎకరాన్ని రిజర్వ్ సైట్ కింద మిగిల్చారు. దీనిపై కన్ను పడ్డ కొందరు రెండు రోజుల క్రితం జేసీబీ ఏర్పాటు చేసి పునాదుల తవ్వకం చేపట్టారు. విషయాన్ని స్థానికులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ మారుతి సిబ్బందితో కలసి వెళ్లి పునాదుల తవ్వకాన్ని అడ్డుకున్నారు. అనుమతి లేకుండా ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టడం సరైంది కాదని హెచ్చరించారు. ఈ విషయంపై తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాల కబ్జాకు యత్నిస్తే కఠిన చర్యలు చేపడతామన్నారు. అర ఎకరంలో తవ్వకాలు చేపట్టిన వారందరికీ అటువైపు వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేశామన్నారు. నిబంధనలను బేఖాతరు చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ప్రాణాలు లెక్కచేయకుండా..

వజ్రకరూరు: మండల కేంద్రంలోని గ్రామసచివాలయం-2 పరిధిలో గరుసగడ్డ(9వ వార్డు)లో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న దాదాఖలందర్ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంతో పాటు కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించి శభాష్ అనిపించుకున్నాడు. కరోనా సమయంలో దాతల సహకారంతో వలంటీర్ ఇంటింటికీ వెళ్లి కాయగూరలు, నిత్యావసర సరుకులు చేరవేయడంలో ప్రత్యేక చొరవచూపాడు. అలాగే తనకు కేటాయించిన ఇళ్ల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నాడు.



కరోనా సమయంలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ దాదా ఖలందర్

వలంటీర్ సేవలు వెలకట్టలేనివి



గతంలో పింఛన్ కోసం పంచాయతీ కార్యాలయం వద్ద రోజుల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ఇంటివద్దకే సంక్షేమ పథకాలు అందజేస్తున్నారు. వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్ దాదాఖలందర్ ఇంటికి వచ్చి పింఛన్ సొమ్మును అందజేస్తున్నాడు. వలంటీర్‌సేవలు అభినందనీయం.

- హవామాబీ, గరుసగడ్డవీధి, వజ్రకరూరు

వృద్ధురాలికి వలంటీర్ అండ

రాయదుర్గంటౌన్: భర్త మృతి చెందడంతో పట్టణంలోని 29వ వార్డులో నివాసం ఉంటున్న అరవ గంగమ్మ భిక్షాటన చేస్తూ బతుకీడ్చుతోంది. ఆ వృద్ధురాలికి వార్డు వలంటీరు లీలావతి అండగా నిలిచింది. ఇటీవల ఆమెకు ఆధార్‌కార్డు చేయించింది. తాజాగా గంగమ్మకు రేషన్‌కార్డు మంజూరు చేయించింది. వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జ్ వైజాగ్ రిబ్కా, రవి దంపతులు శనివారం గంగమ్మకు రేషన్‌కార్డు అందజేశారు. దీంతో గంగమ్మ సంతోషానికి అవధుల్లేకుండా పోయింది. ఎవరూ తోడులేని తనను వలంటీరు కన్నబిడ్డలా చూసుకుంటోందని ఆనందం వ్యక్తం చేసింది. రేషన్ కార్డు రావడంతో గంగమ్మకు వైఎస్సార్ చేయూత, పింఛన్ కోసం దరఖాస్తు చేయించారు. పింఛన్ మంజూరయితే ఆమె కష్టాలు తొలగుతాయి.



అరవ గంగమ్మకు రేషన్‌కార్డు అందజేస్తున్న వలంటీర్ లీలావతి, వార్డు ఇన్‌చార్జ్ వైజాగ్ రిబ్కా

సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం



కణేకల్లు: గోపులాపురంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

కణేకల్లు/గుమ్మఘట్ట: పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం కణేకల్లు మండలంలోని గోపులాపురం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ ప్రకాష్ చౌదరి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కృష్ణారెడ్డి, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలసి విప్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. విప్ మాట్లాడుతూ ఏ గడపకు వెళ్లినా రూ.లక్షల్లో లబ్ధిపొందిన లబ్ధిదారులే కనిపిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని ప్రజలకు సూచించారు. సీఎం జగన్‌పై చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఎన్ని విమర్శలు చేసినా ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో కణేకల్లు పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, మండల జేసీఏ కన్వీనర్ హనుమంతరావు, ఎంపీటీసీ గంగమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు హనుమప్ప, బయనేని కిష్టప్ప, బోయ నాగరాజు, గోపాల్, నగేష్, బషీర్, రవిప్రకాష్‌రెడ్డి, రవి చంద్ర, వేమన, పుల్లంపల్లి పెద్దిరెడ్డి, అంబాపురం భాస్కర్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి, సాధత్, గెనిగెర రాజు, చిన్న సర్మస్ తదితరులు పాల్గొన్నారు.

- గుమ్మఘట్ట మండలంలోని రంగసముద్రం గ్రామంలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరై ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందించి లబ్ధిదారులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని మహిళలు విప్ ఎదుట సంతోషం వ్యక్తం చేశారు. విప్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోమన్‌రెడ్డితోనే అన్నివర్గాల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. సీఎం జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి టీడీపీ నేత చంద్రబాబు, ఆయన కుమారుడు పప్పు, పవన్ కళ్యాణ్ ఓర్వలేకపోతున్నారన్నారు. అనంతరం బీటీపీ గ్రామంలో రూ.16 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవన నిర్మాణానికి విప్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఈటీపీఆర్డీ సురేశ్‌బాబు, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్, ఎంపీపీ భవాని, వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గౌని కాంతారెడ్డి, కాంట్రాక్టర్ కొత్తపల్లి సత్యానారాయణరెడ్డి, సర్పంచులు ఉమేష్, రమేష్, రాజేష్, అనిల్, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, రాజమోహన్ రెడ్డి, గోనబావి ప్రతాప్‌రెడ్డి, ఓంకార్‌రెడ్డి, మంజునాథరెడ్డి, బాదెన్న, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలో ఉన్న బంకుల తొలగింపు

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో వెంకటేశులు (ఓ దినపత్రిక విలేఖరి) ఆక్రమించుకుని నిర్మించిన బంకులు, మరుగుదొడ్లను రెవెన్యూ పంచాయతీ అధికారులు శనివారం జేసీబీ ద్వారా తొలగించారు. అధికారులు ముందుగా వెంకటేశులు ఇంటి వెనుక నుంచి డ్రైనేజీ పూడికను తీసుకుంటూ వచ్చారు. వెంకటేశులు ఇంటి సమీపానికి రావడంతో మా స్థలంలోకి ఎందుకు వస్తారని కుటుంబ సభ్యులు అడ్డు తగిలారు. ఇక్కడ డ్రైనేజీ, రస్తా ఉందని సర్వే ఆధారంగానే తొలగిస్తున్నట్లు ఆర్ఐ బాలకిషన్, వీఆర్ఓ యుగంధర్, పంచాయతీ కార్యదర్శి శివన్న తెలిపారు. ఇక్కడ వరకూ మాకు పట్టా ఉందని ప్రభుత్వం ఇచ్చిన పట్టాలోనే ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్నామని వారు వాదనలకు దిగారు. అధికారులకు తోడు గ్రామస్తులు పెద్ద ఎత్తున రావడంతో ఇది అక్రమణలోనే నిర్మించారని స్థానికులు ఆరోపించడంతో కాసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఎస్ఐ శివ సంఘటన స్థలానికి చేరుకుని అధికారులతో మాట్లాడారు. ఆక్రమణలో ఉన్న రేకుల బంకులను తొలగించాలని 2017లోనే కోర్టు తీర్పు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.



రేకుల బంకులను తొలగిస్తున్న దృశ్యం

మూడు రోజులు సమయం ఇస్తే అక్రమణలో ఉన్న మరుగుదొడ్లను తొలగిస్తామని వెంకటేశులు కుటంబ సభ్యులు అధికారులను కోరారు. ఇందుకు అధికారులు, పోలీసులు ఒప్పుకున్నారు. కానీ గ్రామస్తులంతా ఏకమై రెండు రేకుల బంకులను తొలగించారు. గ్రామస్తులు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి అండదండలతో, దినపత్రికను అడ్డంపెట్టుకోని 35 అడుగుల రస్తాను ఆక్రమించారన్నారు. గతంలో పలుమార్లు అక్రమణలు తొలగించాలని అధికారులకు ఫిర్యాదు చేసినా విలేకరి అని అధికారులు పట్టించుకోలేదన్నారు. కాగా కక్ష సాధింపుతోనే దౌర్జన్యంతో బంకులను తొలగించారని బాధతుడు వెంకటేశులు ఆరోపించారు.

సంక్షిప్త సమాచారం

గ్రామాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

కుందుర్పి: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి జగనన్న ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని బండమీదపల్లి సొసైటీ అధ్యక్షుడు వన్నూర్‌రెడ్డి, సర్పంచ్ విశాలాక్షి అన్నారు.శనివారం మండలంలోని అల్లాపురం గ్రామంలో సిమెంట్‌రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. మంత్రి ఉషాశ్రీచరణ్ సహకారంతో ఒక్కో సచివాలయ పరిధిలో రూ.20 లక్షలు గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటనాయుడు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి, పంచాయతీ కార్యదర్శి ఫక్రుద్దీన్, ఇంజినీర్ అసిస్టెంట్ నరేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికి గౌరవం తీసుకురండి

కళ్యాణదుర్గం: ఉపాధ్యాయ వృత్తికి గౌరవం తీసుకురావాలని సరస్వతీ విద్యా పీఠం జిల్లా కార్యదర్శి రాఘవయ్య సూచించారు. స్థానిక శ్రీసరస్వతి విద్యాపీఠం, అనంతపురం విభాగం విషయాచార్యుల శిక్షణ తరగతులు కళ్యాణదుర్గం పాఠశాల కేంద్రంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోధనలో మెలకువలు, బోధనలో అనుసరించాల్సిన విధానంపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయ వృత్తికి గౌరవం తేవాలని , శక్తి వంతమైన , సంస్కార వంతమైన , సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానాచార్యుడు కరణం తిరుమల రావు, అనంతపురం సమితి కార్యనిర్వహణ అధికారి వి.సి నరసింహులు, శైనిక ప్రముక నాగభూషణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొల్లాపురమ్మ ఆలయానికి రూ.20 లక్షలు

గుమ్మఘట్ట: మండలంలోని ఆర్.కొత్తపల్లిలో ఉన్న కొల్లాపురమ్మ దేవాలయానికి రూ.20 లక్షల రూపాయల నిధులు మంజూరైనట్లు వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి తెలిపారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి ప్రత్యేక చొరవ తీసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను వివరించడంతో టీటీడీ తరఫున నిధులు మంజూరు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తు విప్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియచేశారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు



బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు అంజన్నకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూలవిరాట్‌ను పట్టు వస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలకరించారు. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్‌స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

సమయపాలన పాటించాలి

ఉరవకొండ: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ వరలక్ష్మి సూచించారు. శనివారం మండలంలోని రాకెట్ల సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని రికార్డులు పరిశీలించి ప్రజలకు ఎలాంటి సేవలు అందిస్తున్నరో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న లే అవుట్లలలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడాలన్నారు. లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు మంజూరవుతున్నాయన్నారు. సిమెంట్, ఇసుక సకాలంలో అందించి ఇల్లు నిర్మించుకునేలా లబ్ధిదారులను చైతన్యం చేయాలన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రాయదుర్గం రూరల్: మండలంలోని టి.వీరాపురం గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామదట్ల గ్రామంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ విద్యావతి, ఎంపీడీఓ కొండయ్య శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి నేతృత్వంలో ఉదయం 6.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు , ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని వారు కోరారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

కుందుర్పి: స్థానిక ఎస్సీ కాలనీలోని ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని శనివారం ఎంఈఓ తిప్పేస్వామి పరిశీలించారు. పాఠశాలలో విద్యాబోధన, ఇతర అంశాలను హెచ్‌ఎం ఆంజనేయులును అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చేపట్టిన 'నాడు-నేడు' పనులను సంబంధించి అధికారులు,హెచ్‌ఎంతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ వరలక్ష్మి, కమిటీ మెంబర్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై ఆగ్రహ జ్వాలలు

ఉరవకొండ: మణిపూర్ రాష్ట్రంలో మహిళలనగ్న ఊరేగింపుపై ఆగ్రహ జ్వాలలు వ్యక్తమయ్యాయి. ఈ సంఘటనకు పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ శనివారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం సీపీఐ, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు భారీ ర్యాలీ చేపట్టాయి. సీపీఐ తాలుకా కార్యదర్శి మల్లికార్జున బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు సమాధి కట్టే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఇలాంటి దాడులు జరగకుండా అందరూ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

ద్విచక్ర వాహనాల వేలం రేపు

రాయదుర్గం: రాయదుర్గం సెబ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఈ నెల 24న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సెబ్ సీఐ జయనాథ్‌రెడ్డి శనివారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.3 వేలు ధరావతు చెల్లించాలన్నారు.

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం సెబ్ స్టేషన్ పరిధిలో మద్యం కేసుల్లో పట్టుబడిన 12 వాహనాలను వేలం వేయనున్నట్లు సెబ్ ఎస్ఐ కృష్ణా నాయక్ శనివారం తెలిపారు. ఈ నెల 24న అనంతపురానికి చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో స్థానిక సెబ్ కార్యాలయ ఆవరణలో వేలం నిర్వహిస్తామన్నారు.

సబ్సిడీతో చాప్ కట్టర్లు

కూడేరు: ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో పశుగ్రాసం కత్తిరించే యంత్రాన్ని(చాప్ కట్టర్) పంపిణీ చేయనున్నట్లు మండల పశు వైద్యాధికారి శ్రీనివాసులు శనివారం తెలిపారు. యంత్రం మొత్తం ధర రూ.33,970 కాగా 40 శాతం సబ్సిడీతో రూ.20,382కు ఇస్తామన్నారు. యంత్రం కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకుని నగదు చెల్లించాలని ఆయన సూచించారు.

ఎంపీడీఓకు సన్మానం

ఉరవకొండ: ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన వరలక్ష్మిని శనివారం ఎంపీడీఓ చాంబర్‌లో ఆమిద్యాల పీఏసీఎస్ చైర్మన్, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోనాథ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పెన్నహోబిలం ఆలయ మాజీ చైర్మన్ అశోక్, నెరిమెట్ల సర్పంచ్ యోగేంద్రరెడ్డి, రాయంపల్లి ఎర్రిస్వామిరెడ్డి, దెయ్యాల నాగరాజు, ఉలిగన్న తదితరులు ఘనంగా సత్కరించారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చూడాలని కోరారు.

విధుల్లో సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం

కూడేరు: మండలంలోని ఉదిరిపికొండ సచివాలయంలో పని చేసే ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సమయ పాలన పాటించడం లేదు. శనివారం 12 గంటల ప్రాంతంలో డిజిటల్ అసిస్టెంట్ ఇసాన్, వీఏఏ రాజ్ కుమార్ మాత్రమే ఉన్నారు. వీఏఏ కూడా ఆలస్యంగా వచ్చారు. 9 మంది ఉద్యోగులుంటే ఇద్దరే హాజరయ్యారు. పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు అధికారుల తీరుపై మండిపడ్డారు. ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేయకపోవడంతోనే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. సిబ్బంది హాజరు కాని విషయమై సచివాలయ అడ్మిన్, పంచాయతీ కార్యదర్శి శివరంజనిని వివరణ కోరగా తాను పని నిమిత్తం ఎంపీడీఓ కార్యాలయంలో ఉన్నానన్నారు.వెల్ఫేర్ అసిస్టెంట్ సెలవు పెట్టారు. మిగిలిన వారు ఎలాంటి అనుమతి తీసుకోలేదు. ఫోన్ చేస్తే ఫీల్డ్‌లో ఉన్నామని చెప్పారన్నారు.



ఉదయం 11:45 గంటల సమయంలో విధుల్లో ఒక్కరే ఉన్న దృశ్యం

ఆటో బోల్తా.. కూలీలకు గాయాలు

రాయదుర్గం రూరల్: ఆటో బోల్తా పడిన ఘటనలో ఆరుగురు కూలీలు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. గుమ్మఘట్ట మండలం బేలోడు గ్రామానికి చెందిన తొమ్మిది మంది కూలీలు రాయదుర్గంలో శనివారం పనులు ముగించుకుని సాయంత్రంఆటోలో స్వగ్రామానికి బయలుదేరారు. రాయంపల్లి సమీపంలోని ఫ్యాక్టరీ వద్దకు చేరుకోగానే డ్రైవర్ వేగాన్ని నియంత్రించుకోలేక పోవడంతో ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన పల్లంలోకి బోల్తాపడింది. ఘటనలో కూలీలు లక్ష్మి, హనుమక్క, శారదమ్మ, నాగవేణి, నూర్జహాన్ తదితరులు గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను రాయదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. లక్ష్మి, హనుమక్క పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. కుక్క అడ్డు రావడం వల్లనే ప్రమాదం జరిగినట్లు డ్రైవర్ చెబుతున్నా.. అతి వేగమే ప్రమాదానికి కారణమని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. ఘటనపై రాయదుర్గం అర్బన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఫ్యాక్టరీ వాహనాలను అడ్డుకున్న స్థానికులు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని జిందాల్ ఫ్యాక్టరీకి వెళ్లే వాహనాలను స్థానికులు అడ్డుకున్నారు. పొలాల్లో వాహనాలు తీసుకెళుతున్నారని ఆందోళన చేస్తుండడంతో ఫ్యాక్టరీ యాజమన్యం కోర్టు నోటీసులు పంపించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేసి శనివారం ఫ్యాక్టరీకి వెళ్లే రోడ్డులో వాహనాలను అడ్డుకుని ఆందోళన చేశారు. భారీగా వాహనాలు నిలబడడంతో ఎస్ఐ శివ సంఘటన స్థలానికి చేరుకొని ఎందుకు వాహనాలను ఆపుతున్నారని వారిని ప్రశ్నిస్తే.. మా పొలాల్లోనే వెళుతూ మాకే నోటీసులు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ సిబ్బందిని పిలిపించి ఎస్ఐ మాట్లాడారు. కోర్టులో కేసు వెనక్కి తీసుకుంటే ఆందోళన విరమిస్తామని చెప్పడంతో సిబ్బంది యజమాన్యంతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎస్ఐ శివ స్థానికులకు నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు.

'నారాహి' మెప్పుకోసమే వారాహి

▸▸ 'జగనన్న సురక్ష'లో విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం రూరల్: నారాహి(చంద్రబాబు) మెప్పుకోసమే ప్యాకేజీ కళ్యాణ్ వారాహి యాత్ర చేస్తూ , ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నాడని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి మండిపడ్డారు. మండలంలోని టి.వీరాపురం, డి.కొండాపురం గ్రామాల్లో సర్పంచ్‌లు ఓబుళమ్మ, సుధాకర్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అర్హులందరి సంక్షేమ ఫలాలు అందిస్తూ సుపరిపాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై బురద జల్లడానికి ప్యాకేజీ పావలా టెంట్ రాజకీయాలు చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. ప్రజలకు మంచి జరుగకూడదనే దుర్బుద్ధితో మంచి చేస్తున్న వలంటీర్ వ్యవస్థపై కారు కూతలు కూస్తున్నాడని మండిపడ్డారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీ సభ్యులు చేసిన అరాచకాలు ఆనాడు ఈ దత్తపుత్రుడికి కనిపించేలేదా అని నిలదీశారు. మీ సంక్షేమం కోసం నిరంతరం పరితపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లికార్జున, ఎంపీటీసీలు రాజమ్మ, శివప్ప, శివారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ మురహరి, నాయకులు మహేష్, పాటిల్ రఘు, ఆంజనేయులు, బొమ్మయ్య, రామన్న తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ షకీలాబేగం, జెడ్పీటీసీ నీలవేణి , సర్పంచ్ వన్నూరుస్వామి, వైస్ ఎంపీపీ రమేష్, ఈఓపీఆర్డీ విజయమ్మ, నాయకుడు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



రాయదుర్గం రూరల్ : టి.వీరాపురంలో సర్టిఫికెట్ పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటి పరిధిలోని 11, 12, 13, 14. వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మన్న, వైఎస్సార్‌సీపీ నాయకుడు తిరుమల వెంకటేశులు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు మేనేజర్ అశ్వర్థనారాయణ, ఆర్ఐ సత్యనారాయణ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, అకౌంటెంట్ అక్కులప్ప, పట్టణ జేసీఎస్ కన్వీనర్ అర్చన, సచివాలయ కన్వీనర్ వెంకటేశులు, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షెక్షా తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: మండల పరిధిలోని కరుట్లపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణరెడ్డి, సర్పంచ్ ఓబుళమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు పద్మావతి, అగ్రి అడ్వైజరీ మండల చైర్‌పర్సన్ నిర్మలమ్మ, డీటీ విశ్వనాథ్, సూపరింటెండెంట్ నాగభూషణరెడ్డి , సెక్రటరీ హరి పాల్గొన్నారు.

వజ్రకరూరు: మండలంలోని రాగులపాడులో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, ఉరవకొండ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుశీలమ్మ, ఎంపీపీ రమావత్‌దేవి, సర్పంచులు పి.శ్రీనివాస్‌రెడ్డి, ఉమామహేశ్వరి, కమలమ్మ, ఎఫ్‌పీఓ చైర్మన్ అమర్‌నాథ్, జేసీఎస్ కన్వీనర్ రాచన్నగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ సుధీర్‌రెడ్డి, తహసీల్దార్‌అనిల్‌కుమార్, ఎంపీడీఓ విజయలలిత పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని బొమ్మగానిపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ కంభం చంద్రశేఖరరెడ్డి, సర్పంచ్ ఆదినారాయణరెడ్డి, తహసీల్దార్ బాలకిషన్, ఎంపీడీఓ దాసానాయక్, వైస్ ఎంపీపీ వెంకటేశ్‌నాయక్ , నాయకులు బొజ్జప్ప , రవికుమార్ విరుపాక్షి, నాగేంద్ర పాల్గొన్నారు.

శెట్టూరు: మండలంలోని చిన్నంపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మైథిలీ, ఈఓఆర్డీ రఘురామరావ్, సచివాలయాల కన్వీనర్ తిమ్మరాజు, మండల మాజీ కన్వీనర్ సోమనాథ రెడ్డి, నాయకులు హరినాథ రెడ్డి, సోమశేఖర్ పాల్గొన్నారు.